క్లుప్తంగా

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత



గీతం ఆస్పత్రిలో వృద్ధుడు కొండకు నగదు అందిస్తున్న వలంటీర్ భారతి

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీకి చెందిన గరికిన కొండ అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల రుషికొండ గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా పంచాయతీలోని క్లస్టర్ – సీ7కు చెందిన వలంటీర్ తోట భారతి బుధవారం ఆస్పత్రికి వెళ్లి కొండకు పింఛన్ నగదు అందించింది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం రక్తహీనత (హిమోగ్లోబిన్) పరీక్షలు చేశారు. ఏఎన్ఎంలు భానుమతి, భవానీ విద్యార్థులను పరీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కొనియాడారు. ఎదుగుతున్న పిల్లల్లో రక్తహీనత సమస్య పరిష్కరించేందుకే రాగి అంబలి, వేరుశనగ చక్కీలు అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు నయీం, సుజాత కుమారి, అల్లాడి శ్రీనివాస్, వెంకటరావు, రామకృష్ణ, లక్ష్మి, అశోక్, రవికుమార్ పాల్గొన్నారు.

థీమ్ పార్కుల పనుల పూర్తికి కసరత్తు



బాధ్యతలు చేపట్టిన ఈఈ శాంతిరాజు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లో స్పోర్ట్స్, బటర్ ఫ్లై తదితర 4 థీమ్ పార్కుల పనులు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చురుగ్గా సాగుతున్నాయని, వాటిని సత్వరమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని ఇటీవల బాధ్యతలు చేపట్టిన వర్క్స్ విభాగం ఈఈ కట్టా శాంతిరాజు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలు తదితర పనులు మరింత నాణ్యత, ప్రణాళికతో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈయన ప్రాజెక్ట్స్ విభాగం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మత్స్యరాజు జోన్ – 5ఏ విభాగానికి బదిలీ అయ్యారు.

విశాఖ ఉక్కు రక్షణకు 'చలో స్టీల్‌ప్లాంట్'

తగరపువలస: విశాఖ ఉక్కు రక్షణకు చలో స్టీల్ ప్లాంట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్టు సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రైవేట్ మార్కెట్ వద్ద ఆటోతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో అశేష ప్రజల త్యాగాలతో సాధించుకున్న మణిహారం ఉక్కు కర్మాగారమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ, రూ.3 లక్షల కోట్ల ఆస్తి కలిగి ఉందన్నారు. ఈ బంగారు బాతును విక్రయించడానికి బీజేపీ ఉవ్విళ్లూరుతోందన్నారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యంగా 950 రోజులుగా పోరాటం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు అధికార దాహంతో మోదీని ప్రశ్నించడం లేదన్నారు. నష్టాల బూచితో స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలనుకోవడం కుట్రలో భాగమన్నారు. గురువారం సాయంత్రం కూర్మన్నపాలెంలో నిర్వహించే సభకు ఆల్ ఇండియా కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతున్నారని, సభను జయప్రదం చేయాలని మూర్తి కోరారు.

'సురక్ష'తో అందరి ఆరోగ్యానికి భద్రత



మహిళకు మెడికల్ షీట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు



మజ్జిపేట వైఎస్సార్ క్లినిక్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



వృద్ధునితో మాట్లాడుతున్న వైద్యురాలు శోభారాణి

ఆనందపురం : రాష్ట్రంలో విస్తృతంగా అమలు పరుస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల ప్రజల ఆరోగ్యానికి భద్రత ఏర్పడుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో అందిస్తున్న చికిత్స వల్ల రోగం నయం కాకపోతే పెద్దాస్పత్రికి తరలించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స చేయిస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా ఇంటి వద్దే చికిత్స తీసుకోవాల్సిన రోగులకు ఖర్చుల నిమిత్తం రూ.3 నుంచి రూ.5 వేల వరకూ ప్రభుత్వం సాయం అందిస్తుందని చెప్పారు. గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్లలో ఉచితంగా మందులు లభిస్తున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మందుల పంపిణీని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మ, వైద్యాధికారి గంగునాయుడు, ఎంపీడీవో అడపా లవరాజు, తహసీల్దార్ లోకవరపు రామారావు, సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, ఇల్లాపు వెంకటరావు, అప్పారావు రెడ్డి, చందక అప్పలస్వామి, బంటుబిల్లి సూరినాయుడు పాల్గొన్నారు.

సమస్యలకు ఇంటి వద్దే పరిష్కారం

తగరపువలస: ప్రజలు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ముఖ్యమైన పరిపాలన, ఆరోగ్య, రైతు సమస్యలు గ్రామ స్థాయిలో వారి ముంగిట్లోనే పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీర్చిదిద్దారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం మజ్జిపేట వైఎస్సార్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య ఉండేలా మరో కార్యక్రమం ''జగనన్నా... ఆంధ్రప్రదేశ్‌కు నువ్వే కావాలి'' కార్యక్రమాన్ని ఈ నెల 11న ముఖ్యమంత్రి జగన్ ప్రారంభిస్తున్నారన్నారు. ఊరి ప్రజలందరికీ మంచి చేయాలనే భావనతోనే పనిచేస్తున్నామన్నారు. పంచాయతీలో 600 కుటుంబాలకు రూ.12 కోట్ల సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. గతంలో టీడీపీ హయాంలో ఈ పంచాయతీకి చేసింది శూన్యమన్నారు. ఎన్నికల సమయంలో కులం, సినిమాల పేరుతో వచ్చే వారిని తిప్పి కొట్టాలన్నారు. అనంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలియజేసే కేస్ షీట్లను పంపిణీ చేసి గర్భిణికి సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ పోషకాహార ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరమణ, వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, దుర్గా కల్యాణి, రజనీదేవి, మహమ్మద్ కౌశల్, గోవింద్, సుష్మిత, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మజ్జి నారాయణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నమ్మిడి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, మల్లేటి హరి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, ఏఎన్ఎం బి.రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది రాజీ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

పద్మనాభం: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య నిపుణులతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకే జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నేడు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ శిరిగుడి సంతోషి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించే శిబిరంలో అందించే సేవలను పంచాయతీ ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

జాగరణ యాత్ర రథానికి స్వాగతం



కృష్ణంరాజుపేట చేరుకున్న జాగరణ యాత్ర రథం

తగరపువలస: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ విశాఖ మహానగర శౌర్య జాగరణ యాత్రలో భాగంగా బుధవారం భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయానికి రథం చేరుకుంది. ఈ సందర్భంగా రథానికి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయుడు, వెంకటరావు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గొట్టుపల్లి సత్యనారాయణ తదితరులు రథానికి స్వాగతం పలికారు.

గోస్తనీలో ఒకరు గల్లంతు

పద్మనాభం : పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం సమీపంలో గోస్తనీ నదిలో ఒకరు గల్లంతయ్యారు. పద్మనాభం ప్రాంతానికి చెందిన శీల బుచ్చిబాబు (58) రజక పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇసకలపాలెం సమీపాన గోస్తనీ నదిలోకి దిగాడు. తర్వాత ఎంత సేపటికీ ఆచూకీ కనిపించలేదు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోయింది.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



రాట వేస్తున్న సత్యనారాయణపేట వాసులు



టైలర్స్ కాలనీలో ఉత్సవరాట వేస్తున్న నాయకులు, నిర్వాహకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు స్థానికులు బుధవారం రాట వేశారు. శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా దుర్గాదేవి ఉత్సవాలు జరుపుతామని తెలిపారు.
వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నాయకులు సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

దుర్గా నవరాత్రి ఉత్సవాలకు రాట

మధురవాడ: వరసిద్ధి వినాయక ఉత్సవాలు పూర్తిగా ముగియక ముందే ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభమయ్యింది. మధురవాడ టైలర్స్ కాలనీలో గల శ్రీ విజయదుర్గా దేవి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు బుధవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ధర్మకర్త బంగారు లక్ష్మి, సుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్ కుమార్ రాట వేశారు. 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, బంగారు ప్రకాష్, కమిటీ సభ్యులు తెంటు మాధవి, నాయకులు అప్పన్న, అల్లాడ లింగేశ్వరరావు, బెల్లాపు పాపారావు, గోపి, నాగమ్మ పాల్గొన్నారు.

యాతవాని చెరువు రీ సర్వే ఆపాలి

పద్మనాభం: మండలంలోని రేవిడి యాతవాని చెరువు రీ సర్వే చేయకుండా నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రైతులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ చెరువు గర్భం 8.32 ఎకరాలని ఆ వినతిపత్రంలో తెలిపారు. ఇందులో కొంత విస్తీర్ణానికి కొంతమంది పాస్ పుస్తకాలు చేయించుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. దీనిపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా పాస్ పుస్తకాలు రద్దు చేశారని తెలిపారు. పాస్ పుస్తకాలు రద్దు చేసిన భూమికి రీ సర్వే చేస్తున్నారని వారు ఆ వినతి పత్రంలో తెలిపారు. ఈ భూమికి రీ సర్వే చేయవద్దని, 8.32 ఎకరాల భూమిని చెరువు గర్భంగా ఉంచాలని కోరారు.

15 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి యాగ మహోత్సవాలు

తగరపువలస: భీమిలి రోడ్డులోని అపోలో ఫార్మసీ ఎదురుగా గల నూతన భవనంలో ఈ నెల 15 నుంచి 24 వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి యాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆగమ పండితుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి తెలిపారు. నవదుర్గల విగ్రహాల ప్రతిష్ఠతోపాటు నవగ్రహ హోమాలు, నవనాగార్చన, ధాన్యాభిషేకం, సూర్య నమస్కారాలు, హోమాలలో కార్తవీర్యార్జున, స్వర్ణాకర్షణ భైరవ, కాలభైరవ, వనదుర్గా, ప్రత్యంగిరా హోమాలు నిర్వహించనున్నారు. వివరాలకు 83283 05636లో సంప్రదించాలని కోరారు.

నవ సమాజ నిర్మాణానికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆనందపురం : అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవ సమాజ నిర్మాణానికి పాటు పడుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం, నిమ్మలవారి కళ్లాలు, జగ్గరాజుపాలెం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రజలను కులాలు, రాజకీయ వర్గాలుగా విభజించి పథకాలు అందించడం వల్ల నిజమైన పేదలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పాదయాత్రలో ప్రజల ఇబ్బందులు కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారు. ఎంపీడీవో అడపా లవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ బంక శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు పాండ్రంకి అప్పారావు, గండ్రెడ్డి శ్రీనివాస్, బొట్టా రామకృష్ణ, కోరాడ అప్పలస్వామి నాయుడు, పిన్నింటి వెంకటరమణ పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు వివరిస్తూ మరలా వారి మద్దతు కోరడానికి నిర్వహించనున్న «ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి?» కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను వివరించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర పథకాల లబ్ధిని తెలియజేసి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ప్రతి సచివాలయం పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరించాలని కోరారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎం.బాలరాజు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేస్తే కార్యక్రమం నూటికి నూరు శాతం విజయవంతమవుతుందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహించే విధానాన్ని తెరపై ప్రదర్శించి నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు

- దసరా నాటికి అందరికీ తాగునీరు



మజ్జివలస ఎస్సీ కాలనీలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం



మజ్జివలస కాలనీలో పైప్‌లైన్ ఏర్పాటు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి దసరా నాటికి తాగునీటి సమస్య పూర్తిగా తీరనుంది. గోస్తనీనది తీరంలో ఉన్న ఈ పంచాయతీలో గతంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉండేది. గతంలో తాటితూరు పంచాయతీకి చెందిన చిల్లవాని చెరువు వద్ద బోరు తవ్వి అక్కడి నుంచి మజ్జివలస రక్షిత మంచినీటి పథకానికి నీరు తరలిస్తున్నారు. ఈ పథకం ద్వారా పంచాయతీ తాగునీటి అవసరాలు పూర్తిగా తీరేవి కాదు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీవాసులు ఇటీవల తీవ్రస్థాయిలో తాగునీటి సమస్యను ఎదుర్కొన్నారు. కాలనీలో ఇటీవల మూడు బోరుబావులు పనిచేయకపోవడంతో సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో పంచాయతీ పాలకవర్గం, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. బోరుబావులకు మరమ్మతులు చేయించడంతోపాటు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట వద్ద పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు.

రూ.58 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. అందులో భాగంగా మజ్జివలస పంచాయతీకి రూ.రెండు విడతల్లో రూ.58 లక్షలు మంజూరు చేశారు. అదనంగా పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేశారు. ఈ నిధులతో ఎస్సీ కాలనీలో కొత్తగా రక్షిత మంచినీటి పథకం పూర్తికాగా పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ వారంలో ఇంటింటికీ కుళాయి కలెక్షన్లు పూర్తి చేయనున్నారు. అదనంగా చిల్లవానిచెరువులో మరో బోరుబావి, మోటారు ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ పూర్తి చేసి పంచాయతీలోని 540 మంది కార్డుదారులకు దసరా నాటికి పూర్తిగా తాగునీరు అందించనున్నారు.



ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లు

5వ వార్డులో క్షీణించిన పారిశుధ్యం



పరదేశిపాలెంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

కొమ్మాది: స్వచ్ఛ సర్వేక్షన్ కోసం జీవీఎంసీ కమిషనర్ నుంచి జోనల్ కమిషనర్ వరకు విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుంటే శానిటరీ సిబ్బంది మాత్రం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణలో జీవీఎంసీ 5వ వార్డులో నిర్లక్ష్యం రోడ్డుపైనే కనిపిస్తోంది. పరదేశిపాలెం, మారికవలస, బోరవానిపాలెం ప్రాంతాల్లో రోడ్డుపైనే చెత్త దర్శనమిస్తోంది. ఇటుగా వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిస్తే దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మొండికేసిన సెంటర్ లైటింగ్



హైవేపై అలంకారప్రాయంగా ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభాలు

పీఎం పాలెం: మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో జాతీయ రహదారిని కాంతివంతం చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ సిస్టమ్ ప్రస్తుతం చూపరులను వెక్కిరిస్తోంది. క్రికెట్ స్టేడియం కూడలి మొదలుకుని కొమ్మాది వరకూ గల సెంటర్ లైటింగ్‌లో అరకొరగా లైట్లు వెలుగుతుండడంతో హైవేపై చీకట్లు ముసురుకుంటున్నాయి. ఇక జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్న సర్వీసు రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. చీకటిలో రోడ్డు దాటుతున్న వ్యక్తులను వాహనాలు ఢీకొట్టే సంఘటనలు ఇటీవల సర్వసాధారణం అయిపోయాయి. వెంటనే వీధి లైట్ల నిర్వహణ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సెంటర్ లైటింగ్‌ను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హుండీలో నగదు చోరీ

ఆనందపురం : గుడిలోవలో ఉన్న నారాయణేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలుగొట్టి అందులోని నగదు తస్కరించారు. మంగళవారం సాయంత్రం దేవాలయంలో పూజలు చేసిన తర్వాత పూజారి ఇంటికి వెళ్లిపోయారు. తిరిగి బుధవారం ఉదయం ఆలయం తెరవడానికి పూజారి వెళ్లగా తలుపుల తాళాలు, హుండీ తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. ఈ మేరకు దేవస్థానం చైర్మన్ కోరాడ గిరిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

పార్కు నిర్మించాలని వినతి



సత్యనారాయణపేటలో టాయిలెట్లను పరిశీలిస్తున్న జెడ్సీ రాము తదితరులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సత్యనారాయణపేటలో 20 ఏళ్లుగా మూతపడిన బహిరంగ టాయిలెట్లను కూల్చి పార్కు నిర్మించాలని స్థానికులు జెడ్సీ బి.రాము దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ఈ ప్రాంతంలో పర్యటించిన జెడ్సీ నివాసాల మధ్య చెత్తతో నిండిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ దుర్వాసనతోపాటు దోమలు, పురుగులు వృద్ధి చెంది వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నట్లు స్థానికులు ఆయనతో మొర పెట్టుకున్నారు. వీటిని చదును చేసి పార్కు నిర్మించాలని ఇటీవల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్టు వారు తెలిపారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించనున్నట్టు జెడ్సీ హామీ ఇచ్చారు. ఆయనవెంట మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నాయకులు కంచుబోయిన వెంకటరావు, తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, ఊడికల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.